క్లుప్తంగా

## వివేకానంద యూత్ సభ్యుల రక్తదానం

అలంపూర్: పట్టణానికి చెందిన స్వామి వివేకానంద యూత్ సొసైటీ సభ్యులు మంగళవారం రక్తదానం చేశారు. మిత్రుడు శరత్ జ్ఞాపకార్థం వివేకానంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో కర్నూలులోని రెడ్‌క్రాస్ సొసైటీలో ప్రశాంత్, భరత్ వారి మిత్ర బృందం రక్తదానం చేసినట్లు తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో పలు మార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

## ఫొటో ఎక్స్‌పో పోస్టర్ల ఆవిష్కరణ



అలంపూర్: పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఫొటో ఎక్స్‌పో పోస్టర్లను ఎస్‌ఐ వెంకటస్వామి మంగళవారం ఆవిష్కరించారు. రాష్ట్ర ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 19, 20, 21వ తేదీల్లో ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సంఘ అధ్యక్షుడు రజిత్‌బాష, ఉపాధ్యక్షుడు స్వాములు, కోశాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్‌పై అవగాహన



శాంతినగర్: మండలంలోని తనగలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మోడల్ అసెంబ్లీ ఎన్నికలపై అవగాహన కల్పించారు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులను ఒక్కో తరగతిని ఒక నియోజకవర్గంగా ప్రకటించారు. ఎన్నికల్లో ఓటు ఎలా వేయాలనే విషయమై అవగాహన కల్పించారు. ఎన్నికల అధికారులుగా, పీఓ, ఏపీఓ, అభ్యర్థులు, ఏజెంట్లు, పోలీసులుగా విద్యార్థులు విధులు నిర్వర్తించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చదువుకుంటేనే బంగారు భవిష్యత్




కేటీదొడ్డి: విద్యార్థులను చదివిస్తేనే వారికి బంగారు భవిష్యత్ ఉంటుందని బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్, సీఆర్‌పీ శివరాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెంకటాపురం, కొండాపురం, నందిన్నె తదితర గ్రామాల్లో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొలాల్లో పనిచేస్తున్న బాలలను గుర్తించారు. ఈ సందర్భంగా విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం 8 మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ సిబ్బంది జయన్న, నవీన్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు రక్తదాన శిబిరం



అయిజ: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం శాంతినగర్‌ని ఎన్టీఆర్ విగ్రహం సమీపంలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రక్తదాన శిబిరానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, లక్ష్మణ్‌గౌడ్, మనురెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో సత్తా చాటాలి



ఆత్మకూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జాతీయస్థాయిలో సత్తా చాటాలని ఆత్మకూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా, ఎంపీడీఓ శ్రీపాద్, ఎంఈఓ బాలరాజు, ఎంపీఓ శ్రీరాంరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జాతర మైదానంలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ సెలక్షన్‌లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మండల పరిధిలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పరమేష్, తులసీరాజ్, శ్రీను పాల్గొన్నారు.

# బస్సు నడపండి సారూ..

- రోడ్లు బాగున్నా తిరగని ఆర్టీసీ బస్సులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు
- దోచుకుంటున్న ప్రైవేటు వాహనదారులు



నేతువానిపల్లి నుంచి సద్దలోనిపల్లి స్టేజీ వరకు కాలినడకన వస్తున్న విద్యార్థులు(ఫైల్)

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు బీటీ రోడ్లు బాగున్నా బస్సులు మాత్రం సరిపడినన్ని తిరగడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో బస్సులను నడిపిన ఆర్టీసీ అధికారులు ప్రయాణికులు ఎక్కడం లేదన్న సాకుతో అర్థాంతరంగా నిలుపుదల చేశారు. దీంతో నానా అవస్థలు పడుతున్నట్లు విద్యార్థులు, ప్రజలు వాపోతున్నారు.

**గ్రామాల్లో తిరగని సర్వీసులు**

మండలంలోని సద్దలోనిపల్లి, నేతువానిపల్లి, కుర్తిరావులచెర్వు, తాటికుంట, నాగర్‌దొడ్డి, అయిజస్టేజీ, దాసరపల్లి, బిజ్వారం, మల్దకల్, ఎల్కూరు, విఠలాపురం గ్రామాల్లో బీటీరోడ్డు బాగున్నప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు.

**ప్రైవేటు వాహనాల్లో అవస్థలు**

బస్సులు సరిగా నడపడం లేకపోడంతో ఇదే అదనుగా భావించిన ప్రైవేటు వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేయడంతో పాటు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తూ ప్రజల ప్రాణాల తో చెలగాటం ఆడుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయపై ప లు మార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

**తప్పని కాలినడక**

వ్యవసాయ పనుల కోసం ఆయా గ్రామాలకు చెందిన రైతులతో పాటు విద్యార్థులు ప్రతి రోజు 3 కి.మీ. మేర కాలినడకన వెళ్లి వస్తున్నారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు గత్యంతరం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



నిర్మానుష్యంగా కుర్తిరాలచెర్వు రోడ్డు

### బస్సు సౌకర్యం కల్పించాలి



నాగర్‌దొడ్డికి బస్సు సౌకర్యం కల్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. రోడ్డు బాగానే ఉన్నా బస్సులు తిరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. గ్రామం నుంచి నాగర్‌దొడ్డి స్టేజీ వరకు కాలినడకన వెళ్లి బస్సులు ఎక్కి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

– రాముడు, నాగర్‌దొడ్డి

### పట్టించుకోవడం లేదు



మల్దకల్ నుంచి కుర్తిరావుల చెర్వు మీదుగా అయిజ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ప్రతి నిత్యం వివిధ పనుల నిమిత్తం అయిజ– గద్వాలకు వెళ్లేందుకు 4 కి.మీ. దూరం కాలినడకన వెళ్తున్నాం.

– బుడ్డన్న, కుర్తిరావల్ చెర్వు

### చర్యలు తీసుకుంటాం



రోడ్డు సౌకర్యం ఉన్న బస్సు సర్వీసు నడపని గ్రామాలను పరిశీలించి బస్సు సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఆయా గ్రామాల్లో బస్సు సర్వీసులు సరిగా లేవని ఫిర్యాదులు వస్తున్నాయి. వెంటనే ఆయా రూట్లకు బస్సు సర్వీసులను కొనసాగిస్తాం.

– సునీత, డిపో మేనేజర్, గద్వాల

## పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మానవపాడు శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీడీపీఓ సుజాత



మాట్లాడుతున్న సీడీపీఓ అక్ష్యదీప్తి

మల్దకల్: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సీడీపీఓ అక్ష్యదీప్తి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దపల్లి రైతువేదికలో పోషణ్ బీ పడాయ్ బీ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలతో రోగనిరోధక శక్తి అందుతుందన్నారు. ఈ నేపథ్యంలో తల్లికూడా పౌష్టికరమైన ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణి, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోషకాహార లోపం ఉన్న చిన్నారులను గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వాసంతి, సుధారాణి, తెల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**కొనసాగుతున్న రెండో రోజు శిక్షణ**

మానవపాడు: మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సీడీపీఓ సుజాత అధ్యక్షతన పోషణ్ అబియాన్ బీ పడాయి బీ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లకు రెండో రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. సమగ్రమైన నాణ్యమైన ప్రారంభ ప్రేరణ, బాలల సంరక్షణ విద్య, విద్యా సేవాల నాణ్యత పెంపొందించడానికి శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని సీడీపీఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విమోచన దినోత్సవాన్ని నిర్వహిద్దాం

అలంపూర్: విమోచన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహిద్దామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు శరత్‌బాబు అన్నారు. పట్టణంలోని టూరిజం హోటల్‌లో బీజేపీ ముఖ్యనేతల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17ను విమోచన దినోత్సవంగా జరపాలన్నారు. ప్రధాని మోదీ తెలంగాణాలో విమోచన దినోత్సవం నిర్వహించడానికి సంకల్పించినట్లు తెలిపారు. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని అలంపూర్ క్షేత్ర ఆలయాల్లో బీజేపీ ఆధ్వర్యంలో శ్రీ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు స్వీట్ల పంపిణీ, శాంతినగర్‌లో రక్తదాన శిబిరం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగమల్లయ్య, రంగస్వామి, నరేష్, లోకనాథం, కృష్ణ, వెంకటస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు శరత్‌బాబు

## ఓజోన్ పొరను రక్షించుకుందాం

గట్టు: మానవాళి మనుగడ ఓజోన్ పొర భద్రంగా ఉన్నంత కాలమేనని ప్రభుత్వ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కేఎస్‌డీ రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు ఫిరోజ్ మాట్లాడుతూ.. 1987లో మాంట్రియల్ ప్రోటోకాల్‌లో భాగంగా ఓజోన్ పొర తరుగుదల కారణమయ్యే క్లోరో ఫ్లోరో కార్బన్‌ల మోతాదుకు తగ్గించేందుకు ప్రపంచ దేశాలు చేసుకున్న ఒప్పందం గుర్తు చేశారు. ఓజోన్ పొర అతినీలలోహిత కిరణాలను నేరుగా భూమిపై పడకుండా కాపాడుతున్నట్లు తెలిపారు. మానవాళి తప్పిదాల కారణంగా ఓజోన్ పొరకు ముప్పువాటిల్లుతున్నట్లు పేర్కొన్నారు. ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీదేవీ, ఆయేషా, రాఘవేంద్ర, జయరాజ్, మహేష్, సుప్రజ, భరత్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

## తాగి వాహనం నడిపితే చర్యలు



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద మాట్లాడుతున్న సీఐ రవిబాబు

ధరూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ శ్రీహరి హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని రేవులపల్లి క్రాస్ రోడ్డులో నిర్వహించిన తనిఖీల్లో డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వాహనాల తనిఖీ**

అలంపూర్: రాష్ట్ర సరిహద్దులోని పుల్లూరు టోల్‌ప్లాజా శివారులో సీఐ రవిబాబు వాహనాల తనిఖీ నిర్వహించారు. పలువురికి జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శేఖర్, పోలీస్ సిబ్బంది, హైవే సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు జాతీయ జెండా ఆవిష్కరణ


ఇటిక్యాల: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యలయంలో జాతీయ జెండా ఆవిష్కరించనున్నట్లు ఎంపీడీఓ అజార్ మొహియుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



మానవపాడు: మండలంలోని కలుకుంట్ల మండల పరిషత్ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు మౌలాలి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. ఈ నేపథ్యంలో మంగళవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, రియల్‌ఎస్టేట్ బీచుపల్లినాయుడు, లోకారెడ్డి తదితరులు ఘనంగా ఉపాధ్యాయుడిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ఆంజనేయులుగౌడ్, మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఆత్మలింగారెడ్డి, ప్రధానోపాధ్యాయులు, రాముమూర్తి, జ్యోతి, యోగినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



ధరూరు: మండల పరిధిలోని వామన్‌పల్లి గ్రామాని కి చెందిన పెద్ద తిమ్మన్న అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాసు హనుమంతునాయుడు ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రాజారెడ్డి, వెంకటేష్‌నాయుడు, శేఖర్‌నాయుడు, రాములు, ప్రహ్లాద్, గోపాల్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: మండల పరిదిలోని వల్లూరు గ్రామానికి శివారెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే అబ్రహం ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## వీధికుక్కల స్వైరవిహారం



ఇటిక్యాల: మండల పరిధిలో శునకాలు స్వైర విహారం చేస్తున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా 2025లో మొత్తం 80 మంది కుక్కకాటు బారిన పడ్డారు. నిరంతరం దాడులు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికై నా వీధికుక్కల బెడద తప్పించాలని కోరుతున్నారు.

## సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

అలంపూర్: నియోజకవర్గంలోని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందంచడమే లక్ష్యమని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూలులోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను, ఎల్‌ఓసీలను మంగళవారం అందజేశారు. నియోజకవర్గంలోని 109 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి ద్వారా రూ.24,35,500 విలువైన చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి, బాలకృష్ణారెడ్డి, రఘురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

## నడిరోడ్డుపై విద్యార్థుల ధర్నా

అయిజ: ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయడం లేదని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) అయిజ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో వివిధ కళాశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. రోడ్డు బైఠాయించి ధర్నా చేశారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కాసేపు పెనుగులాట జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నగర కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రూ. 8600 కోట్ల స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాల్సి ఉందని అన్నారు. విద్యార్థుల బలి దానాలతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే ఇప్పుడు అదే రాష్ట్రంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. తక్షణమే ప్రభుత్వం బకాయి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌ఎఫ్‌డీ కోకన్వీనర్ వెంకటేష్, నగర సంయుక్త కమిటీ సభ్యులు శ్రీహరి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

## ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి



సభ్యత్వం చేయిస్తున్న యూటీఎఫ్ నాయకులు

శాంతినగర్: ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రమేష్ అన్నారు. 20 నుంచి 25 ఏళ్లపాటు ఉపాధ్యాయ వృత్తిలో సర్వీస్ చేసిన తరువాత ఇప్పుడు టెట్ సర్టిఫికెట్ పొందాలని ప్రభుత్వం ఆదేశించడం ఎంతవరకు సబబు అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరధిలోని శాంతినగర్‌లో వడ్డేపల్లి మండల ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 317 జీవో వల్ల స్థానికత కోల్పోతున్న ఉపాధ్యాయుల మానసిక పరిస్థితిని అర్థం చేసుకుని వారి వారి సొంత జిల్లాలకు కేటాయించాలన్నారు. పెండిగ్‌లో ఉన్న ఐదు డీఏలను తక్షణమే విడుదల చేయాలన్నారు. పీఆర్‌సీని ప్రకటించి, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వడ్డేపల్లి మండల యూటీఎఫ్ అధ్యక్షులు యాదయ్య, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, జిల్లా బాడీ నాయకులు తిలక్, ఉపాధ్యాయులు శివ, మధు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతతోపాటు పౌష్టికాహారం

మల్దకల్: గర్భిణులు, బాలింతలు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలని వైద్యురాలు స్వరూపరాణి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్త్ నారీ శసక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు నెలనెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శివప్ప, శ్రీధర్, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

**స్వస్త్ నారీ శసక్త్ అభియాన్**

మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ హేమమానస, హేమలత ఆధ్వర్యంలో ఆశాలు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. స్వస్త్ నారీ శసక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు 100 మంది మహిళలకు అన్ని రకాల రుగ్మలతలపై స్క్రీనింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెలెన్, అక్కమ్మ, చంద్రన్న, యాకుబ్‌బాషా, సంధ్య, వీణశ్రీ,, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



మల్దకల్‌లో మాట్లాడుతున్న వైద్యురాలు స్వరూపరాణి

## ఘనంగా క్షౌరవృత్తిదారుల దినోత్సవం

శాంతినగర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు నాయీబ్రాహ్మణులు అందరికీ అందేలా చూడాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ అంబేద్కర్ చౌరస్తాలో క్షౌ ర వృత్తిదారుల దినోత్సవాన్ని మండల నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుల దైవం వైద్య ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. నాయీబ్రాహ్మణులంతా ఐకమత్యంగా ఉండి డిమాండ్లు సాధించుకోవాలన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు దస్తగిరి, చిన్న రామకృష్ణ, ఆంజనేయులు, నర్సింహులు, మధు, రాముడు తదితరులు పాల్గొన్నారు.



క్షౌర వృత్తిదారుల దినోత్సవంలో పాల్గొన్న నాయిబ్రాహ్మణులు

## సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి

ఎర్రవల్లి: సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ మురళి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోదండాపురంలో పోలీసు కళా బృందం సభ్యులు డయల్ 100, రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలు, సీసీ కెమెరాల ఉపయోగం వంటి అంశాలపై పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. రోజు రోజుకు పెరుగుతున్న దొంగతనాలతో జాగ్రత్తలు పాటించాలన్నారు. బంగారు, నగదు, విలువైన వస్తువులు బ్యాంకులో భద్రపర్చుకోవాలన్నారు. యువత బెట్టింగులు, చెడు వ్యసనాల బారిన పడి ప్రాణాల మీదికి తెచ్చుకోరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు ఎస్‌ఐ కేశవరావు, రాధమ్మ, రామాంజనేయులు, షీటీం హెచ్‌సీ శేషన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ మురళి

## మహిళా సంఘాల సభ్యులకు రుణాలు



మాట్లాడుతున్న సీసీ నవీన్ కుమార్

ధరూరు: స్వయం సహాయక సంఘాల్లో ఉన్న ఇందిరమ్మ లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు మంజూరు చేయనున్నట్లు ఐకేపీ సీసీలు నవీన్‌కుమార్, జయరాజ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ర్యాలంపాడులో మహిళా సంఘాల సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హత గలిగిన ప్రతి సంఘానికి రుణాలు మంజూరు చేస్తారన్నారు. మహిళా సంఘం, దివ్యాంగుల సంఘం, బాలికా సంఘం, వృద్ధుల సంఘం ఇలా నాలుగు రకాల సంఘాల సభ్యులకు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి, వీఓఏ శోభ పాల్గొన్నారు.